క్లుప్తంగా

వీఎంసీ నూతన భవన నిర్మాణ పనుల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను మేయర్ రాయన భాగ్యలక్ష్మి గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భవనం నిర్మాణ స్థితిగతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూడో ఫ్లోర్‌లో జరుగుతున్న మార్బుల్, సీలింగ్, విద్యుత్ సదుపాయం, ప్లాస్టరింగ్ పనులను పరిశీలించి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మేయర్ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యూవల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న లెక్చరర్స్ 2023–2024 విద్యా సంవత్సరానికి రెన్యూవల్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, కళాశాల విద్యాశాఖ, రాజమహేంద్రవరం వారి ఆదేశాల మేరకు ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల నందు 2022–2023 విద్యా సంవత్సరంలో మార్చి 31 తేదీ నాటికి కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పని చేసిన వారు మాత్రమే కాంట్రాక్ట్ పునరుద్ధరణకు అర్హులన్నారు. అర్హత కలిగిన అధ్యాపకులు ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వచ్చిన దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్ ఐడీ కళాశాల(ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల) ప్రిన్సిపాల్‌కు సమర్పించాలన్నారు. 23వ తేదీన కాంట్రాక్ట్ పునరుద్ధరణకు జిల్లా ఎంపిక కమిటీ ముందు అభ్యర్థులు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు 24వ తేదీన ఆయా కళాశాలల్లో బాండ్లు సమర్పించాలని ఆమె కోరారు.

20న జూనియర్స్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

భవానీపురం(విజయవాడపశ్చిమ): గన్నవరంలోని బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 20వ తేదీన జూనియర్స్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.అనిల్ కుమార్, ఆర్ సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 2008 నుంచి డిసెంబర్ 2009 మధ్య జన్మించిన బాల బాలికలను ఎంపిక చేస్తామన్నారు. అర్హత గల ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు. క్రీడాకారులు రిజిస్ట్రేషన్ కోసం పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీని తీసుకురావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ భవానీపురం ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు స్వాతి థియేటర్ రోడ్డు, మానవ మందిరం రోడ్డు, అమృత అపార్ట్‌మెంట్ రోడ్డు, పోపూరివారి వీధి, హనుమయ్య వీధి, గుడివాడ రామారావు వీధి, ప్రసాద్ హోటల్ రోడ్డు, లత హాస్పిటల్ రోడ్డు, ఎంపీ దాస్ వీధి, ఆకుల రాజేశ్వరరావు మిల్ రోడ్డు, చెట్ల బజార్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గొర్ల మూడి శేఖర్‌బాబు అన్నారు. పటమట కోనేరు బసవయ్య చౌదరి జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక్కసారి ధూమపానం, మద్యం, హెరాయిన్, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసిక రుగ్మతలు, క్యాన్సర్ వంటి రోగాల బారిన పడతారన్నారు. మత్తు పదార్థాలతో ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతారని చెప్పారు. వీటిని తీసుకోవటం వల్ల నేర ప్రవృత్తి పెరుగుతుందని, వీటికి అలవాటు పడిన వారిని డీ–ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. వీటిబారిన పడిన వారికి నవజీవన్ బాల భవన్ నూజివీడులో బాస్కో డీ–ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందని, పెజ్జోనిపేటలో నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని ఉచితంగా సంప్రదించవచ్చని చెప్పారు. వివరాలకు 94904 92020 నంబరులో సంప్రదించాలన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం షేక్ సుల్తానా, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్లు ఎస్.జాకబ్ రాజు, షేక్ నజ్మ, వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- రూ.42.45 లక్షలతో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శంకుస్థాపన
- ప్రతిపక్షాల మాటలు ప్రజలు నమ్మరు



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గ వ్యాప్తంగా కొట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 48వ డివిజన్ టీనరపేట తమ్మిన పోతరాజు కల్యాణ మండపం మొదటి అంతస్తు నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే వెలంపల్లి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మీలు పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి మీడియాతో మాట్లాడుతూ.. రూ. 42.45 లక్షల వ్యయంతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని మూడు నెలలో పూర్తి చేస్తామన్నారు. డివిజన్‌లోని మంచినీటి సమస్య పరిష్కారం కోసం వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టామన్నారు. దెబ్బతిన్న రోడ్లు, మెట్లు, కాల్వల మరమ్మతులకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చించామని చెప్పారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక నియోజకవర్గంలో భారీగా అభివృద్ధి జరిగిందన్నారు. గతంలో అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేసిన ప్రభుత్వాలను చూశామని, ఇప్పుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో శిలాఫలాలను వేయడమే కాకుండా ఆ పనులకు ప్రారంభించిన ఘనత మా ప్రభుత్వానిదేనన్నారు.

ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని, విద్యుత్ ఉద్యమంలో ప్రజలను కాల్చి చంపింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు.

ఆ రాతలు సరికాదు..

శుంఠ పుత్రుడు లోకేష్, దత్త పుత్రుడు పవన్ ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే వెలంపల్లి చెప్పారు. ప్రభుత్వం చేసే కార్యక్రమాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని కొన్ని పత్రికలు రాస్తున్నాయని, లోకేష్, పవన్ కళ్యాణ్, చంద్రబాబు చేపట్టే కార్యక్రమాలకు ప్రజాదరణ లేక పోయినా అవి సక్సెస్ అంటూ పొగడ్తలతో రాయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెద బాబు, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, అయితా కిశోర్, తొత్తడి వరలక్ష్మి, చిచ్చా, మహమ్మద్ బాషా, గురు ప్రసాద్, వానపల్లి త్రిమూర్తులు, కొరికాని మల్లేశ్వరరావు, ఆర్.సూరిబాబు, కోళ్ల రజనీ, యంగల శ్రీను, కొరికాని నాగు, దుక్క హరి, భాస్కర్, దుక్క దుర్గారావు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

జేవీఆర్‌హెచ్‌హెచ్ ఆధ్వర్యంలో అన్నదానం ప్రారంభం



రామమందిరం వద్ద అన్నదానం చేస్తున్న పూనూరు గౌతంరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని జయహో విజయవాడ రెసిడెంట్స్ హెల్పింగ్ హ్యాండ్స్(జేవీఆర్‌హెచ్‌హెచ్) వారి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిత్యాన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ డాక్టర్ పి.గౌతంరెడ్డి తెలిపారు. ఏలూరు రోడ్డులోని రామమందిరం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 15వ తేదీ వరకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. జయహో విజయవాడ రెసిడెంట్స్ హెల్పింగ్ హ్యాండ్స్ గత పుష్కర కాలంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సంస్థ పేదవారికి అండగా నిలుస్తోందని చెప్పారు. ఎండాకాలం, వర్షాకాలం, శీతాకాలాల్లో పేదలకు అవసరమైన చలివేంద్రాలు, దుప్పట్ల పంపిణీ, గొడుగులు పంపిణీ చేస్తున్నారన్నారు. సమాజ సేవలో తమ వంతు పాత్రను సమర్థవంతంగా పోషిస్తున్న ట్రస్ట్ సభ్యులను ఆయన అభినందించారు. వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, శ్యాంప్రసాద్, హరినాథ్, దుర్గాప్రసాద్, శర్మ పాల్గొన్నారు

ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన



రాధాకృష్ణుల విగ్రహాలను పరిశీలిస్తున్న చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు గురువారం పరిశీలించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణానికి చేరుకున్న చైర్మన్, ఈవో, వైదిక కమిటీ సభ్యులు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకోవడంతో పాటు మరింత వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో అతి పురాతనమైన రాధాకృష్ణుల విగ్రహాలను పరిశీలించారు. రాధాకృష్ణుల విగ్రహాలతో పాటు చుట్టూ ఉన్న గోపికల విగ్రహాలను అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, మురళీ, కోట ప్రసాద్, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక దురాచారాలను పారదోలాలి



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ సమరం

పటమట(విజయవాడతూర్పు): సామాజిక అసమానతలను, సాంఘిక దురాచారాలను పాటించడం రాజ్యాంగ విరుద్ధమని ప్రముఖ వైద్యుడు జి.సమరం అన్నారు. నాస్తిక కేంద్రంలో సాంఘిక దురాచారాల నిర్మూలన అంశంపై గురువారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పేరుకుపోయిన అవినీతి, అనాగరికత, దోపిడీ వ్యవస్థలను రూపుమాపాలని, స్త్రీలపై జుగుప్సాకరంగా జరుగుతున్న ప్రవర్తనలు అంతం కావాలన్నారు. ఉన్నత విద్యావంతుల కుటుంబాల్లోనూ స్త్రీలపై చులకన భావం పెరుగుతుందని, ఇది సమాజ శ్రేయస్సు కాదని చెప్పారు. ఈ నెల 9న క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఆర్థిక సమాత మండలి ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, బి.మణి, గోరా సైన్స్ డైరెక్టర్ జి.నియంత, దిలీప్ పాల్గొన్నారు.

కమ్యూనిస్ట్ నాయకుల వ్యాఖ్యలు సరికాదు

జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్



వించిపేట(విజయవాడపశ్చిమ): కమ్యూనిస్ట్ నాయకుల వ్యాఖ్యలు సరికాదని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ చెప్పారు. వించిపేట, నైజాంగేటుసెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. కాలం చెల్లిన కమ్యూనిస్ట్ నేతలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, నగరంలో జరిగిన అభివృద్ధి పనులపై మాట్లాడే అర్హత లేదన్నారు. ఒకప్పుడు ప్రజా ఉద్యమాలకు మారుపేరుగా, నిస్వార్థ రాజకీయాలకు పెట్టింది పేరుగా ఉన్న కమ్యూనిస్టు నాయకులు నేడు స్వార్థ రాజకీయాలతో బూర్జువా మనస్తత్వాలతో కలుషితమై ప్రజాదరణను పూర్తిగా కోల్పోయారన్నారు. ఇటీవల నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభోత్సవం చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రతిపక్షాలకు అవకాశం లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన చేస్తుందని అన్న సందర్భాన్ని వక్రీకరిస్తూ కమ్యునిస్టు నాయకుడు కోటేశ్వరరావు విమర్శలు చేయడాన్ని గౌస్‌మొహిద్దీన్ ఖండించారు. తమ ఉనికిని పూర్తిగా కోల్పోయిన కమ్యూనిస్ట్ నాయకులు పేదల పక్షాన నిలబడిన వైఎస్ జగన్, సజ్జల, వెలంపల్లిని విమర్శించడం ఆకాశం మీద ఉమ్మేసిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎప్పుడూ ఏదో ఒక పార్టీకి తోకపార్టీగా ఉంటూ తమ ప్రభావాన్ని పూర్తిగా కోల్పోయిన కమ్యూనిస్టులు ఇప్పుడైనా పేదల పక్షాన నిలబడితే కనీస గౌరవమైనా మిగులుతుందని హితవు పలికారు.

బెంజిసర్కిల్‌లో కాకాని విగ్రహాన్ని పునరుద్ధరించాలని వినతి



పురంధేశ్వరికి వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ తరుణ్ కాకాని

భవానీపురం(విజయవాడపశ్చిమ): వ్యవసాయ, పాడి పరిశ్రమ శాఖ దివంగత మంత్రి, జై ఆంధ్ర ఉద్యమ మార్గదర్శకుడు కాకాని వెంకట రత్నం విగ్రహాన్ని విజయవాడ బెంజి సర్కిల్‌లో పునరుద్ధరించాలని కాకాని ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరిని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018లో జరిగిన రోడ్డు విస్తరణ సమయంలో సర్కిల్‌లో ఉన్న కాకాని విగ్రహాన్ని తొలగించారన్నారు. కాకాని విగ్రహాన్ని తొలగించిన ప్రదేశంలోనే పునరుద్ధరణ చేయాలని కోరారు. కాగా ఈ అంశంపై పురంధేశ్వరి సానుకూలంగా స్పందించారని తరుణ్ కాకాని తెలిపారు.

● తుది దశకు అంబేడ్కర్ పార్క్ పనులు



పార్కులో ఏర్పాటు చేసిన ఏనుగు బొమ్మ



వాటర్ ఫౌంటెన్



మొక్కలతో రూపొందించిన వివిధ ఆకృతులు

నగరంలో కృష్ణలంక జాతీయ రహదారి, బందరు కాలువ వెంబడి ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్క్ సుందరీకరణ పనులు తుది దశకు చేరుకున్నాయి. నగరపాలకసంస్థ రూ.1.5 కోట్లతో పనులు చేపట్టింది. అంబేడ్కర్, రాఘవయ్య పార్కులకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన రోప్ బ్రిడ్జి, పార్కులో ఏర్పాటు చేసిన గ్రీనరీ, పాథ్ వేస్, మల్టీ ప్లే సిస్టమ్, సైకిల్ ట్రాక్, ఫౌంటెన్లు, ఏనుగు బొమ్మతో పాటు మొక్కలతో రూపొందించిన వివిధ ఆకృతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– కృష్ణలంక(విజయవాడతూర్పు)



అంబేడ్కర్, రాఘవయ్య పార్కులకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన రోప్ బ్రిడ్జి

సీపీని కలిసిన పదోన్నతి పొందిన ఇన్‌స్పెక్టర్లు



భవానీపురం(విజయవాడపశ్చిమ): సబ్ ఇన్‌స్పెక్టర్ నుంచి ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన అధికారులు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు రేంజి పరిధిలో 20 మంది ఎస్ఐ నుంచి ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందారు. వీరిలో ఎన్టీఆర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐలు ఎస్.రమేష్, పి.సత్య శ్రీనివాస్, ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందారు. ఈ క్రమంలో వారు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ టి.కె.రాణాను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

● ఊపందుకున్న సాగు పనులు



జిల్లా వ్యాప్తంగా చెదురుమొదురుగా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. చోడవరం వద్ద కంద చేనుకు మందు పిచికారీ చేస్తున్న రైతును చిత్రంలో చూడవచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం గుణదలలోని హోటల్ హయత్ ప్లేస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్న దృష్ట్యా అక్కడి భద్రతా ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ టి.కె.రాణా పరిశీలించారు. హోటల్ వద్ద, పరిసర ప్రాంతాల్లో చేస్తున్న కట్టుదిట్టమైన భద్రత, పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లపై ఆయన గురువారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హోటల్ హయత్ ప్లేస్ పార్కింగ్ ప్రదేశాలు తదితర వివరాలను తెలుసుకుని కార్యక్రమానికి విచ్చేసే ప్రముఖులకు, ప్రజలకు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పరంగా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చేయటంలో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. ఈ సందర్భంగా సీపీ టి.కె.రాణా మాట్లాడుతూ గుణదలలోని హోటల్ హయత్ ప్లేస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎస్పీ రవీంద్రబాబు, ఏసీపీ పి.భాస్కరరావు, ఇన్‌స్పెక్టర్ గుణరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

● భళా బెజవాడ



నగరపాలకసంస్థ అధికారులు చేపడుతున్న అభివృద్ధి పనులతో నగరం రూపురేఖలు మారుతున్నాయి. కాలువల్లో చెత్త వేయకుండా నివారించేందుకు కాలువలకు ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా విజయవాడ కృష్ణలంక హైవే నుంచి పశువుల ఆస్పత్రికి వెళ్లే బందరు కాలువ వంతెనపై ఫెన్సింగ్‌కు అమర్చిన పూల మొక్కలు, విద్యుత్ స్తంభాలు, లైట్లు ప్రత్యేక ఆకర్షణగా ఉండడంతో నగర వాసులు భళా బెజవాడ అని కితాబిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఆర్‌యూబీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

పటమట(విజయవాడతూర్పు): మధురానగర్‌లో వీఎంసీ తలపెట్టిన ఆర్‌యూబీ(రోడ్డు అండర్ బ్రిడ్జి)పనులు త్వరతగతిన పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం సెంట్రల్ నియోజకవర్గంలోని మధురానగర్ 29వ డివిజన్ సాయిబాబా కాలనీలో జరుగుతున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. అధికారుల నుంచి వివరాలు అడిగి తీసుకున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి కొనసాగుతున్న పనుల్లో భాగంగా మధురానగర్ ఆర్‌యూబీ నిర్మాణ ప్రాజెక్ట్‌ను వీఎంసీ చేపట్టిందన్నారు. స్థానికుల రాకపోకలకు, ట్రాఫిక్ సమస్యలను అరికట్టేందుకు, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ బ్రిడ్జి పనులు వేగంగా చేయాలన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన బందరురోడ్డు, బీఆర్టీఎస్ రోడ్లలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, శానిటేషన్‌ను పరిశీలించారు. నగరంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించాలని అధికారులకు సూచించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, అధికారులు పాల్గొన్నారు.

జైనులకు రిజర్వేషన్లు అమలు చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెడికల్ సీట్లలో జైనులకు మైనారిటీస్ కోటాలో ఉన్న రిజర్వేషన్లను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ జైన్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి కోరారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.బాబ్జీ, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రం అందించామని మనోజ్ కొఠారి పేర్కొన్నారు. మెడికల్ సీట్ల దరఖాస్తు క్రమంలో ఆన్‌లైన్‌లో మైనారిటీస్ విభాగంలో జైన్ ఆప్షన్ లేదన్నారు. దీనివల్ల జైనులు సీట్ల విషయంలో నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని ఆయా ఉన్నత వర్గాలకు వివరించి జైనులకు నష్టం జరగకుండా చూడాలని కోరామని తెలిపారు. జైనులు ఇప్పుడిప్పుడే విద్యాపరంగా ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని, వారికి వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

● ఆటోనగర్(విజయవాడతూర్పు): నైపుణ్యతను వెలికి తీయడం ద్వారా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారని విజయవాడ జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ డాక్టర్ వై.విద్యాకన్నా తెలిపారు. జవహర్ ఆటోనగర్ 100 అడుగుల రోడ్డులోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో అసిస్టెంట్ టెక్స్‌టైల్ ప్రింటర్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. శిక్షణలో మహిళలు పాల్గొన్నారు.